దుబ్బాక ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

చేగుంట, ఫిబ్రవరి 16: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని చేగుంట మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సిద్ధిరెడ్డి, యాదగిరి, సిద్ధిరాములు, కుమార్‌యాదవ్, నాగులు, స్వామి, యాదగిరి, సత్యనారాయణ, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

త్వరలోనే మెదక్ దవాఖానలో సిటీ స్కానింగ్

-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 16 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు త్వరలోనే సీటీ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ ప్రభుత్వ దవాఖానకు నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారని, దవాఖానలో సిటీ స్కానింగ్ లేకపోవడంతో ప్రైవేట్ కేంద్రాలకు వెళ్తుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విషయాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లడంతో సిటీ స్కానింగ్ సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. సిటీ స్కానింగ్ సెంటర్ వస్తే ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు ఆర్థిక ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు

సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 16: రథ సప్తమి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో శుక్రవారం ఆచార్యులు, విద్యార్థులు సమూహిక సూర్య నమస్కారాలు చేశారు. కార్యక్రమంలో ప్రధా న ఆచార్యులు ఆనంద్‌రెడ్డి, ఆచార్యులు చంద్రశేఖర్, దుర్గేశ్, నవీన్, సుధారాణి, సద్గుణ, స్వప్న, నాగమణి, దివ్య, యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట దత్తాత్రేయ ఆలయంలో

రామాయంపేట, ఫిబ్రవరి 16: పట్టణంలోని దత్తాత్రేయ ఆలయంలో రథసప్తమి సందర్భంగా పూజారి శ్రీనివాసచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో యువజ్యోతి క్లబ్ క్లబ్ నిర్వాహకుడు సత్యనారాయణ సూర్య నమస్కారాలు యోగాసనాలు చేయించారు.

సమయపాలన పాటించని టీచర్‌కు మెమో జారీ

ఉపాధ్యాయుడు రాకపోవడంతో పాఠశాల ఆవరణలో నిలబడ్డ విద్యార్థులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 16: మండలంలోని నెల్లూరు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు సమయపాలన పాటించకపోవడంతో ఎంఈవో యాదగిరి శుక్రవారం మెమో జారీ చేశారు. ఉదయం విద్యార్థులు పాఠశాలకు వచ్చి తరగతి గదుల్లో కూర్చున్నారు. ఉదయం 10:30 గంటలైన ఉపాధ్యాయుడు రాకపోవడం గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎంఈవో యాదగిరికి సమాచారం అందించారు. వెంటనే ఎంఈవో పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుడు పాఠశాలకు ఉదయం 11:30 గంటలకు వచ్చారని తెలిపారు. నెల్లూరు పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులుగా ఉన్నారని, ఉపాధ్యాయురాలు సెలవుపై వెళ్లారని తెలిపారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.

బ్యూటీ పార్లర్ ప్రోడక్ట్స్ పేరిట మోసం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 16: రోజ్‌గోల్డ్ బ్యూటీపార్లర్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేసినవారిని శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. ఇస్మాయిల్ పాషా, సమీనా, ప్రేమకుమారి, దేవకుమారి తదితరులు రోజ్ గోల్డ్ బ్యూటీపార్లర్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశారన్నారు. బ్యూటీపార్లర్ ఫ్రాంచైజీ ఇస్తామని, తమ ఉత్పత్తులను విక్రయిస్తే అధిక మొత్తంలో లాభాలు ఇస్తామని అడ్వాన్స్‌గా పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని తెలిపారు. బ్యూటీ పార్లర్ ప్రొడక్ట్స్ ఇవ్వకుండా మోసం చేశారని బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేశామని, రవి, విశ్వతేజ, జాన్‌పాషా పరారీలో ఉన్నట్లు వివరించారు. అరెస్టు చేసినవారిని రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్నవారిని త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

సమయస్ఫూర్తితో ప్రమాదాలు ఎదుర్కోవాలి

ప్రమాదాలను ఎదుర్కొనే విధానాలను వివరిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

టేక్మాల్, ఫిబ్రవరి 16: వరదలు, భూకంపాలు, ఇతర ప్రమాదాల బారి నుంచి సమయస్ఫూర్తితో బయటపడాలని ఎన్డీఆర్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్‌యాదవ్ సూచించారు. విపత్తులను ఎదుర్కొనే రక్షణ చర్యలపై గ్రామాల్లో ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శుక్రవారం టేక్మాల్‌లోని రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడుకునే విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మాడిలెట్టి, ఎంపీపీ స్వప్నారవి, తహసీల్దార్ కృష్ణ, ఎస్సై రమేశ్, ఎంపీడీవో రియాజొద్దీన్, ఏవో రాంప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి

మెదక్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమైక్య పిలుపుమేరకు సార్వత్రిక సమ్మెలో భాగంగా టీఎన్జీవో ఆధ్వర్యంలో ధర్నా చేపట్టామన్నారు. నూతన పెన్షన్ విధానం రద్దు, కాంట్రాక్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఆదాయ పన్ను పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో పద్మశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఫజలుద్దీన్, కోశాధికారి చంద్రశేఖర్, నాయకులు చిరంజీ వచార్యులు, శివాజీ, రాధ, రామాగౌడ్, శ్రీకాంత్, తులసీరామ్, లవన్, సత్యనారాయణ, సలీం, గంగకృష్ణ. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ అభివృద్ధికి కృషి చేద్దాం

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- నర్సాపూర్ మున్సిపల్ వార్షిక బడ్జెట్ ఆమోదం
- అంచనా ఆదాయం రూ.4088.82 లక్షలు
- అంచనా వ్యయం రూ.4052.78 లక్షలు

మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి 16: నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేద్దామని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతనలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మున్సిపల్ వార్షిక బడ్జెట్ 2024-25, సవరించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్‌ను పద్దుల వారీగా గణాంకాధికారి వెంకట్‌రావు చదివి వినిపించారు.వార్షిక బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన ఆదాయం రూ.4088.82 లక్షలు, అంచనా వేసిన వ్యయం రూ.4052.78 లక్షలు. 2024-25 సంవత్సరానికి మున్సిపల్ సాధారణ అంచనా ఆదాయం రూ.697.82 లక్షలు, అంచనా వేసిన సాధారణ వ్యయం రూ.661.78 లక్షలు. 2024-25 కాలానికి 10 శాతం గ్రీన్ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు రూ.66.18 లక్షలు. సమావేశంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ... బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నర్సాపూర్ డిపోకు పది బస్సులు కేటాయించాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమావేశంలో మున్సిప ల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మున్సిపల్ కమిషనర్ జైత్‌రాంనాయక్, మున్సిపల్ కమిషనర్ మాజీ వెంకట్‌గోపాల్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆహ్వానం

నర్సాపూర్, ఫిబ్రవరి 16 : నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ జైతురామ్‌నాయక్‌ను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సత్కరించి, ఆహ్వానం పలికారు. బదిలీపై వెళ్తున్న కమిషనర్ వెంకట్‌గోపాల్‌ను సన్మానించి, వీడ్కోలు పలికారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే

పాపన్నపేట, ఫిబ్రవరి 16: ఏడుపాయల వనదుర్గా భవానీమాతను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్‌తోపాటు పూజారులు ఎమ్మెల్యేను సన్మానించారు.

మెదక్ మున్సిపాలిటీ: ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

అల్లాదుర్గం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో డ్రైవర్లు

రామాయంపేటలో ఆటోవాలాల ర్యాలీ

ఆటోవాలాలను ఆదుకోవాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి చూపాలని డిమాండ్
- ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా, రాస్తారోకో
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేసిన ఆటో డ్రైవర్లు
- సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె సక్సెస్

రామాయంపేట మెదక్ రోడ్డులో నిలిపేసిన ఆటోలు

చిన్నశంకరంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో నిరసన చేస్తున్న ఆటో కార్మికులు

చిన్నశంకరంపేటలో..

జిల్లావ్యాప్తంగా చేపట్టిన ఆటోల బంద్ శుక్రవారం విజయవంతం అయింది. ఆటోడ్రైవర్లు పలుప్రాంతాల్లో ఆందోళన చేపట్టి, ర్యాలీలు నిర్వహించి, ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం(మహాలక్ష్మి పథకం)తో తమ జీవితాలు రోడ్డున పడ్డాయని ఆటో యూనియన్ నాయకులు పేర్కొంటున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఆటోలు ఎక్కడం లేదని.. ఫలితంగా తమకు రోజూ కూలీ కూడా దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరాకీ లేకపోవడంతో ఆటో ఫైనాన్స్ కట్టలేక పోతున్నామని తెలిపారు. ఇప్పటికే పలువురు ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ మెదక్ జిల్లాలో విజయవంతమైంది. పట్టణాలు, మున్సిపాలిటీలు, గ్రామాల్లో సంఘటిత, అసంఘటిత రంగాల్లోని కార్మికులు ర్యాలీలు నిర్వహిస్తూ సమ్మె చేపట్టారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, రూ. 10వేల పింఛన్ చెల్లించాలని సీఐటీయూ, బీఆర్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. లేబర్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కోతారి కమిషన్ సిపార్సుల ప్రకారం పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, ఉద్యోగ నియమాకాల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన వర్కర్లు, ఐకేపీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్, పంచాయతీ కార్మికులు, హమాలీలు, ఆటో డ్రైవర్లతో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- మెదక్ జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 16

రేగోడ్‌లో నిరసన చేస్తున్న కార్మికులు, రైతులు

మనోహరాబాద్: కాళ్లకల్ జాతీయ రహదారిపై ధర్నా

తూప్రాన్ బస్టాండ్ ఎదురుగా ఆటో కార్మికుల ధర్నా, రాస్తారోకో

తిరుమల జాతరకు పోటెత్తిన భక్తజనం

స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు

నిజాంపేట, ఫిబ్రవరి 16: మండలంలోని చల్మెడలో తిరుమలనాథ స్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తిరుమల నాథస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ రాంరెడ్డి ధ్వజారోహణం, మూలమూర్తుల అభిషేకం, నైవేద్యం, హారతి కార్యక్రమాలు చేపట్టారు. వేదబ్రాహ్మణులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి జాతరకు బందోబస్తు ఏర్పాటు చేశారు. నందిగామ, చల్మెడ గ్రామాలకు చెందిన రైతులు తమ ఎడ్లబండ్లను వివిధ రంగులతో అలంకరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. తిరుమలస్వామి జాతరకు సుమారు 15 వేల మంది భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమల నాథ స్వామికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రెడ్డి, నాయకులు మహేందర్, మారుతి, నసీరుద్దీన్, ముత్యంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భూమాగౌడ్, రాజిరెడ్డి, రామచంద్రం, మోహన్‌రెడ్డి, రాజయ్య తదితరులు ఉన్నారు.

ఇల్లు లేకున్నా.. లక్షల్లో బిల్లు

- రూ.2లక్షలు కట్టాలంటూ

విద్యుత్‌శాఖ నోటీసు

పాపన్నపేట, ఫిబ్రవరి 16: ఎప్పుడో కూలిపోయిన ఇంటికి రూ.2 లక్షలు కరెంటు బిల్లు చెల్లించాలంటూ నోటీసు రావడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం పాపన్నపేటలో టేక్మాల్, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల కోసం సమావేశం ఏర్పాటు చేశారు. పెద్దశంకరంపేట మండలం జంబికుంట గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన ఇల్లు కూలిపోయి ఏండ్లు గడుస్తున్నదని, ప్రస్తుతం తనకు ఇల్లు లేకపోయినా విద్యుత్ అధికారులు రూ.2 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చారని ఫిర్యాదు చేశాడు. అలాగే, 80 యూనిట్లకు రూ.8,467 బిల్లు వచ్చిందని అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌కు చెందిన అంజయ్య ఫిర్యాదు చేశాడు. వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 74 ఫిర్యాదులు వచ్చాయని, విని యోగదారుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ నాగేశ్వర్ రావు, కమిటీ సభ్యులు వెంకట్, మెదక్ జిల్లా ఏడీ మోహన్ బాబు, ఏఈ నర్సింలు, పొల్కంపేట రవి, సద్దాం హుస్సేన్‌తో పాటు మండలాల వినియోగదారులు పాల్గొన్నారు.

నిబంధనలతో పరిశ్రమలను ఏర్పాటు చేయాలి

- అదనపు కలెక్టర్ రమేశ్‌కుమార్

- చిన్నశంకరంపేటలో ప్రజాభిప్రాయ సభ

మాట్లాడుతూ అదనపు కలెక్టర్ రమేశ్‌కుమార్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ నిబంధనలకు లోబడే పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్‌కుమార్ సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట శివారులో రాధా స్మెల్టర్స్ పరిశ్రమ ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీలో ఎమ్మెస్ బిల్లెట్స్ ఉత్పత్తిని ఏడాదికి 26.465 నుంచి 11.11.860 టన్నులు, రోలింగ్ అండ్ టీఎంటీ ఉత్పత్తిని 4,16,98 నుంచి 11.11.960 టన్నులకు పెంచుతున్నారు. ఇందులో భాగంగా పరిశ్రమ విస్తరణపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభను శుక్రవారం చిన్నశంకరంపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటుతోపాటు పర్యావరణాన్ని కాపాడడం ముఖ్యమన్నారు. రూ.90కోట్ల వ్యయంతో రాధాస్మెల్టర్స్ పరిశ్రమను విస్తరిస్తున్నట్లు, దీంతో 400 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రాజు కోరారు. ప్రజాభిప్రాయ సేకరణలో పీసీబీ ఈఈ కుమార్‌పాఠక్, ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, పరిశ్రమ ఎండీ సునీల్, మాజీ ఎంపీపీ కృపావతి, మాజీ సర్పంచ్‌లు రాజిరెడ్డి, కిష్టయ్య, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

చేగుంటలో పట్టపగలు దొంగతనం

కారు వద్ద బాధితులు

చేగుంట, ఫిబ్రవరి 16 : చేగుంట మండలకేంద్రంలో దొంగలు హల్‌చల్ చేశారు. ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి రూ. 5లక్షల నగదును చోరీ చేసిన ఘటన చేగుంటలో శుక్రవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన అసన్నగారి చంద్రరెడ్డి చేగుంటలోని యూనియన్ బ్యాంక్‌లో డబ్బులు డ్రా చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పెద్దచెప్యాల గ్రామానికి చెందిన బిల్డర్ విష్ణువర్ధన్‌రెడ్డికి నగదు అప్పగించాడు. అనంతరం చేగుంటలోని సీతారామకాలనీలో నివాసం ఉంటున్న కుమారుడి ఇంటికి చంద్రారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఒకే కారులో వచ్చారు. ఇంటి బయట కారును పార్కింగ్ చేసి, ఇద్దరు ఇంట్లోకి వెళ్లారు. టీ తాగిన అనంతరం ఇద్దరు కారు దగ్గరికి వచ్చారు. అప్పటికే కారు అద్దం పగులగొట్టి డిక్కీలో పెట్టిన రూ.5లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రరెడ్డి చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామాయంపేట సీఐ వెంకటేశ్, చేగుంట ఎస్సై బాల్‌రాజు సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా దొంగలను పట్టుకుంటామని చేగుంట ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

నేడు మెదక్‌లో కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

మెదక్ మున్సిపాలిటీ/మనోహరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ పుట్టినరోజు పురస్కరించుకుని శనివారం జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యా లయంలో జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు పట్టణాధ్యక్షుడు గంగాధర్ ప్రకటనలో తెలిపారు. మనోహరాబాద్ మండలం, తూప్రాన్‌లోని పెద్ద చెరువు కట్టపై హనుమాన్ ఆలయంలో కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మండలాధ్యక్షుడు మహేశ్ ముదిరాజ్ తెలిపారు.

గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ

రామాయంపేట, ఫిబ్రవరి 16: రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా సాలూరా ఎక్సైజ్ కార్యాలయం నుంచి రామాయంపేటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రామాయంపేట ఎక్సైజ్ సర్కిల్‌లో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తునట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సీఐ రాణికి ఎక్సైజ్ ఎస్సై విజయసిద్దార్థ శుభాకాంక్షలు తెలిపారు.

అగ్రిటెక్ సౌత్ - 2024 ఎగ్జిబిషన్

మెదక్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ) : అగ్రిటెక్ సౌత్ -2024 ఎగ్జిబిషన్ హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. భారత పరిశ్రమల సమాఖ్య వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక అభివృద్ధిని రైతులకు పరిచయం చేయడానికి అగ్రిటెక్ సౌత్ - 2024 ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నది. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లాలోని 21 మండలాల నుంచి సుమారు 100 మంది రైతులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌కు వెళ్లినవారిలో రైతులతోపాటు మండల వ్యవసాయశాఖ అధికారులు, ఆత్మ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యార్థి ఉద్యమకారుల సమావేశం

రామాయంపేట, ఫిబ్రవరి 16 : హైదరాబాద్‌లోని లడ్డీకాపూల్ సెంట్రల్ కోర్టు హాల్‌లో శనివారం విద్యార్థి ఉద్యమకారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు, సమావేశానికి మెదక్ జిల్లాలోని విద్యార్థి ఉద్యమ నాయకులు హాజరుకావాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక జిల్లా అధ్యక్షుడు, లాయర్ కుమార్ సాగర్ పిలుపునిచ్చారు. రామాయంపేటలో శనివారం మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలకమైన పాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమకారుల సంక్షేమం, అభివృద్ధిపై సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన జిల్లా అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 16: మెదక్ జిల్లాకు బదిలీపై వచ్చిన జడ్పీ సీఈవో ఎల్లయ్య, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీనివాస్‌రావు శుక్రవారం జడ్పీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్‌ను కలిశారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో 2024-25 డీపీడీపీ ప్లాన్ ద్వారా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, జడ్పీటీసీలు రమేశ్‌గౌడ్, బాబ్యానాయక్, మాధవి, షర్మిల, కవిత, సుజాత. మేఘమాల, కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్ ఆహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ స్థలంలో నిర్మాణాలు చేపట్టొద్దు

వెల్దుర్తి, ఫిబ్రవరి 16: మండలకేంద్రం వెల్దుర్తిలో గ్రంథాలయానికి కేటాయించిన స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం వెల్దుర్తిలో గ్రంథాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. స్థల పరిశీలనలో జిల్లా గ్రంథాలయ సహాయకులు నరేందర్ రెడ్డి, శంకర్, లైబ్రేరియన్ స్వామి, ఈవో బలరాంరెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట